సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎంపీ ఎంవీవీ సమక్షంలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17, 18వ వార్డులకు చెందిన 50 మందికి పైగా యువకులు 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పేర్ల దుర్గారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని కొత్తగా చేరిన వారికి ఎంవీవీ సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, అనిల్, రాము, గిరి, ఎల్లాజీ, ధనరాజ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



ముడసర్లోవ పార్కులో సమావేశమైన ఏయూ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఆరిలోవ: ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్‌లో 1988 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో సమావేశమయ్యారు. కుటుంబ సభ్యులతో హాజరై ఆట పాటలతో సరదాగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు వై.శ్రీనివాసరావు, ఎం.వి.గంగాధరం, ఎ.వి.రామకృష్ణ, పి.చంద్రశేఖరరావు, ఎస్.జోగారావు, కె.నర్సింహారావు, సీహెచ్.ప్రసాద్, దల్లి శ్రీనివారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి కళింగ సేవా సంఘం మద్దతు



ఎంవీవీని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు ఆరిలోవకు చెందిన కళింగ సేవా సంఘం ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఎంవీవీ సత్యనారాయణ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపించేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నంబల అప్పారావు, కార్యదర్శి సీహెచ్.నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: స్థానిక 22వ వార్డు మంగాపురం కాలనీలో ముస్లింలతో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ముస్లిం సోదరుడు తమకు మద్దతు పలకాలని ఎంవీవీ కోరారు. ముఖ్యమంత్రి జగన్ మైనారిటీల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గోపాలపురం పరిశీలకుడు గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ), వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

నమ్మి ఓటేసిన ప్రజలను వమ్ము చేయకూడదు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలి. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో? లేదో తెలుసుకుని అండగా నిలవాలి. కానీ తూర్పు నియోజకవర్గంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. గెలిపించిన ప్రజలను ఐదేళ్ల పాటు గాలికి వదిలేసిన టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన సొంత వ్యాపారాలను చక్కబెట్టుకున్నారు. మూడు సార్లు వరుసగా గెలిపించారన్న విశ్వాసం కూడా ఆయనకు లేకపోవడం గమనార్హం.

ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ నాయకులు నియోజకవర్గంలో నిత్యం ప్రజల మధ్య ఉంటూ అండగా నిలిచారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చారు. కరోనా కష్ట సమయంలో కూడా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రహదారుల ఆధునికీకరణ, పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, యూపీహెచ్‌సీల నిర్మాణం, ఇలా ఒక్కటేమిటీ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించి వారి మన్ననలు పొందారు.

ప్రజలతో మమేకం



సార్వత్రిక ఎన్నికలు సమీపించిన వేళ ఇప్పుడు రెండు పార్టీలు ప్రజా క్షేత్రంలోకి వెళ్లాయి. ఐదేళ్ల పాటు ముఖం చాటేసిన ఎమ్మెల్యే వెలగపూడి.. ఇప్పుడు ఎన్నికల్లో ప్రజలకు దగ్గర కావడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో మళ్లీ ఓటేయండి అంటూ అడగడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. మరో వైపు ఐదేళ్ల పాటు ప్రజల మధ్యన ఉంటూ వారి బాగోగులు చూసుకున్న వైఎస్సార్‌సీపీకి వాడవాడలా బ్రహ్మరథం పడుతున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రజలతో మమేకమవుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఆప్యాయంగా పలకరిస్తూ సహపంక్తి భోజనాలు చేస్తూ కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకుంటూ వారితో కలిసిపోతున్నారు. బాధితులకు సాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని ఎంపీ ఎంవీవీ హామీ ఇస్తున్నారు. – ఆరిలోవ

జగనన్న ప్రభుత్వ హయాంలో గడపగడపకూ వైఎస్సార్‌సీపీ

లోటుపాట్లు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారం

ఐదేళ్లుగా పత్తా లేని టీడీపీ నాయకులు

ముఖం చాటేసిన ఎమ్మెల్యే వెలగపూడి



9వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ(ఫైల్)



పదో వార్డులో కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ(ఫైల్)

ప్రజల్లో వైఎస్సార్‌సీపీ

2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తూర్పు నియోజకవర్గంలో మాత్రం ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు ఎన్నికయ్యారు. అయినా వైఎస్సార్‌సీపీ నాయకులు నిరాశ చెందకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేశారు. ఆ తరువాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన కార్పొరేటర్లు మరింత చురుగ్గా పని చేస్తూ ప్రజలు మన్ననలు పొందారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అన్ని వార్డుల్లోనూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలతో నేరుగా మాట్లాడి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టాక వైఎస్సార్‌సీపీ బలం మరింత పుంజుకుంది. నియోజకవర్గంలో ఎంవీవీ మరింత జోరుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

సిద్ధం సభలతో పెరిగిన జోష్

ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాదయాత్రలు, గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో నిత్యం ప్రజలను కలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సుమారు వంద రోజుల పాటు నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో పాదయాత్ర చేశారు. ఇప్పటి వరకు వార్డుల్లో సుమారు 30 ఇళ్లల్లో కార్యకర్తలతో కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు. వార్డుల్లో ఇంత వరకు 37 సిద్ధం సభలు నిర్వహించారు. ఈ సభల ద్వారా సుమారు 60 వేల మందికి పైగా ప్రజలను కలిశారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. దీంతో పాటు ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ఎంవీవీ కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా దూసుకుపోతున్నారు. వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. అర్హులై ఉండి లబ్ధి పొందని వారితో వెంటనే సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేయించారు. పలువురి అర్హులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయించారు. పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి ఆర్థిక సహాయం అందించి నేనున్నానంటూ భరోసా కల్పించారు.



10వ వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీ

ఐదేళ్లలో అభివృద్ధి పరవళ్లు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత **2019 నుంచి** నియోజకవర్గంలో అభివృద్ధి పర**వళ్లు తొక్కింది.** అన్ని వార్డుల్లో సుమారు **రూ.200 కోట్లతో** 990 పనులు చేపట్టారు.

- **నియోజకవ**ర్గంలో రూ.8.80 కోట్లతో ఇసుక**తోట, పెదవా**ల్తేరు, ఆరిలోవ ప్రాంతాలలో 8 **చోట్ల యూపీ**హెచ్‌సీలు నిర్మించారు.
- **రూ.7 కోట్ల** నిధులతో 3 చోట్ల గెడ్డలపై బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టారు.
- రూ.9.90 కోట్లతో ముడసర్లోవ రిజర్వాయరు, దాని పరిసరాలలో జీవీఎంసీకి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ గోడలు నిర్మించారు.
- సుమారు రూ.16 కోట్లతో ఆరిలోవ, రామకృష్ణాపురం, ఎంవీపీ కాలనీల్లో గెడ్డల ఆధునికీకరణ పూర్తి చేశారు.
- సుమారు రూ.8 కోట్లతో బాలాజీనగర్‌లో జీవీఎంసీ ఆధునిక కల్యాణం మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



12వ వార్డులో విస్తరించిన డబుల్ రోడ్డు



ఇసుకతోటలో ఆధునికీకరించిన పాఠశాల

- సుమారు రూ.3 కోట్లతో హనుమంతవాక, డెయిరీ ఫారం, విశాలాక్షినగర్, పెదగదిలి, ఉషోదయా తదితర కూడళ్లను ఆధునికీకరించారు.
- రూ.6 కోట్లతో బీఆర్‌టీఎస్‌లో చినగదిలి షిర్డీ సాయిబాబా గుడి నుంచి సూర్యతేజానగర్ వరకు, హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ కూడలి వరకు విస్తరణ చేపట్టి డబుల్ రోడ్లు నిర్మించారు.
- సుమారు రూ.7 కోట్లతో బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి నుంచి తోటగరువు, తోటగరువు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రోడ్ల విస్తరణ చేపట్టడానికి శంకుస్థాపనలు జరిగాయి.
- వీటితో పాటు ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, పెదవాల్తేరు, వెంకోజీపాలెం, విశాలాక్షినగర్, ఆరలోవ ప్రాంతాలలో రహదారుల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.

ఐదేళ్లలో 'వెలగ'బెట్టింది శూన్యం



తూర్పులో 2019 సాధారణ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వెలగపూడి విజయం సాధించారు. ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేయాల్సిన ఆయన.. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో లేదని సాకు చూపితూ దూరంగా ఉన్నారు. కనీసం ప్రతిపక్షం పాత్ర పోషించలేదు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పక్కనపెట్టి తన సొంత ప్రాంతమైన విజయవాడతో పాటు హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చక్కబెట్టుకున్నారు. అక్కడ వ్యాపారాలలో తలమునకలై ఇక్కడ ప్రజలకు దూరమయ్యారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు సుమారు నాలుగేళ్లకు పైగా ముఖం చాటేశారు. 2023లో ఆగస్టులో చంద్రబాబుని అరెస్టు చేసినప్పుడు నిరసనలు తెలపడానికి ప్రజల్లోకి వచ్చారు. ప్రజా సమస్యలు గురించి పట్టించుకోని వెలగపూడి.. తమ నాయకుడుని జైల్లో పెట్టినప్పుడు వచ్చాడంటూ ప్రజలు చర్చించుకోవడం అప్పట్లో కనిపించింది. దీంతో పాటు కొందరు టీడీపీ కార్యకర్తలతో కలసి రోజా నియోజకవర్గంలో ఏదో చోట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆ నిరసనకు ప్రజలు నుంచి మద్దతు లభించలేదు. సరికదా ఆ పార్టీ కార్యకర్తలే ఎక్కువ మంది దూరంగా ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో కూడా ప్రజల నుంచి అదే తీరు కనిపిస్తోంది. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో ప్రజలు కూడా ఆయనకు దూరంగా ఉంటున్నారు. అధికారికంగా నిర్వహించిన శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సైతం ఎమ్మెల్యే వెలగపూడి గైర్హాజరు కావడంతో ప్రజలు మరింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చర్చిలు, మసీదుల్లో ఎంవీవీ ప్రార్థనలు



సాద్ సంగత్ మత పెద్దలతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



చర్చి సందర్శన సందర్భంగా ఆశీర్వాద ప్రార్థనలో పాల్గొన్న ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన విజయం సాధించేలా ఆశీర్వదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం తూర్పు నియోజకవర్గంలోని పలు చర్చిలు, మసీదులను సందర్శించి ప్రార్థనలు చేశారు. ఎంవీపీ కాలనీలోని సెక్టార్–2 ఇమ్మానియేల్ లూథరన్ చర్చి, బేతని హౌస్ చర్చి, లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ చర్చిలో ఎంవీవీ పాస్టర్ల ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే విశాఖ గురుద్వారాలోని సాద్ సంగత్‌తో తూర్పు నియోజకవర్గంలోని పలు మసీదులకు ఎంవీవీ సందర్శించారు. ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మత్స్యకారులకు భరోసా



మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ



సమావేశానికి హాజరైన జాలరిపేట వాసులు

ఎంవీపీ కాలనీ: మత్స్యకారులకు అన్ని విధాలా అండగా నిలిచింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డులో జాలరిపేటలో ఆదివారం మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు వేట విరామం సమయంలో నిధులు మంజూరు చేయడంతో పాటు వారి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం గత ఐదేళ్ల జగనన్న పాలన సాగిందన్నారు. సామాజిక, రాజకీయ ప్రాధాన్యత కూడా కల్పించామన్నారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో మేలు జరిగిందన్నారు. సీపీ జగన్ స్ఫూర్తితో పెదజాలరిపేటను మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు గత ఆరు నెలలుగా విశేష కృషి చేసినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, కల్యాణ మండపం, ఆలయాల ఆధునికీకరణ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి రాజబాబు, వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పలువురు డైరెక్టర్లు, వార్డ్ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

అశోక్‌కుమార్‌కు ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థి అశోక్‌కుమార్ చౌదరికి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో ×ఎ స్టడీ ఆన్ ది ఆప్టిట్యూడ్ ఆఫ్ టీచర్స్ టువర్డ్స్ ద యూజ్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టీచింగ్ ఇన్ ది సెకండరీ స్కూల్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి అశోక్‌కుమార్ డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏయూ క్యాంపస్: కరకచెట్టు పోలమాంబ జాతరను పురస్కరించుకుని మద్దివారి కుటుంబ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఓమ్నిఆర్కే, వీ డెంటల్, డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పెదవాల్తేరులోని ఫ్రెండ్స్ యూనియన్ క్లబ్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, దంత, నేత్ర పరీక్షలతో పాటు సాధారణ వైద్య సేవలు అందించారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చిల్ల రామారావు రెడ్డి, కార్యదర్శి దల్లి అప్పలరెడ్డి, గ్రామ పెద్దలు నీలారెడ్డి, బాపి రెడ్డి, సిహెచ్.రామిరెడ్డి, మద్దివారి కుటుంబ సంఘం గౌరవ అధ్యక్షుడు మద్ది అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌వో కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట: తూర్పు నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆర్‌వో, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదివారం సందర్శించారు. పోలీసు, ఇతర అధికారులతో కలిసి ఆరిలోవ, కృష్ణా కళాశాల పరిధిలో ఉండే పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను గమనించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు జేసీ సూచించారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా మే 13న జరిగే పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీల అభ్యున్నతి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ విభాగం నాయకులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి జరిగిందని ఆ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గూడపాటి విక్టర్ తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఆరిలోవ ప్రాంతం ఎస్‌వీఏ హోటల్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలకు పెద్ద పీట వేశారన్నారు. ఎస్సీలకు రాజకీయ ఎదుగుదలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఎస్సీలు నిర్లక్ష్యానికి గురయ్యారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికే ఎస్సీల పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఎస్సీలకు ఏమీ చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ విభాగం నాయకులు ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి వీర్రాజు, పెదగదిలి గ్రామ సెక్రటరీ మువ్వల శ్రీనివాసరావు, కాకర గోవింద్, వంకర బాబూరావు, నందికోల అర్జున్, తోట డేవిడ్, లింగాల వెంకటశ్రీధర్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు



16వ వార్డులో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

బీచ్ రోడ్డు: రాష్ట్ర భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌తో సాధ్యమని వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో మేము సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముందు పేదలు ఆర్థికంగా మెరుగుపడాలని, అందుకే సంక్షేమ పథకాలను నేరుగా జగనన్న అందిస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలను దోపిడీ చేసిన జన్మభూమి కమిటీలను తరిమికొట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి సంక్షేమాన్ని చేర్చామన్నారు. ఈ ఐదేళ్లలో 4.40 లక్షల ఉద్యోగాలను కల్పించామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పి.వి.నారాయణ, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, ఎస్సీ సెల్ జోన్ విభాగం అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో బీసీవై అభ్యర్థుల ప్రచారం

ఏయూ క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆదివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి యడ్ల వేణుగోపాల్ కృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మురపాల బాలాజీ యాదవ్ పార్టీ కరపత్రాలు అందించి తమను గెలిపించాలని కోరారు.

రక్షణ గోడ నిర్మాణం పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల హాస్టల్ చుట్టూ నిర్మిస్తున్న రక్షణ గోడ నిర్మాణాన్ని ఆదివారం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానం వెనుక భాగంలో హాస్టల్ చుట్టూ పటిష్టంగా రాతి గోడ నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణం పటిష్టంగా జరపాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆయన సూచించారు.

ప్రచార పర్వం



ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి మద్దతుగా 18వ వార్డు అప్పుఘర్, మూలపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయందర్, పార్టీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, స్థానిక నాయకులు



ఏయూ క్యాంపస్: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా 21వ వార్డు చినవాల్తేరు పీతల వీధిలో ప్రచారం చేస్తున్న పార్టీ వార్డు అధ్యక్షుడు మధుపాడ రవికుమార్, కన్వీనర్లు, కార్యకర్తలు



ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ 13వ వార్డు జైభీంనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత, తదితరులు